# 23మందికి శిక్షణ.. 12మందికి కానిస్టేబుల్ ఉద్యోగం

- ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషనే.. శిక్షణ కేంద్రం
- యువతను మెరికల్లా తీర్చిదిద్దిన ఇన్‌స్పెక్టర్ సైదులు



టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ సైదులును కలిసి కృతజ్ఞతలు తెలిపిన కానిస్టేబుళ్లు

వెంగళరావునగర్, అక్టోబర్ 8 : నిరుద్యోగ యువతకు పోలీసులు మార్గదర్శనం చేశారు. కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించేందుకు పేద కుటుంబాలకు చెందిన యువతకు ఆ పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎంతగానో ప్రోత్సహించారు. కృషి, పట్టుదల, దృఢ సంకల్పం ఉంటే విజయం సాధించవచ్చని నిరూపించారు. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఇన్‌స్పెక్టర్ సైదులు యువతకు శిక్షణ ఇప్పించి మెరికల్లా తీర్చిదిద్దారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజ సేవలో భాగంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని తన భుజాన వేసుకున్నారు. తమ ప్రాంతంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన ఉద్యోగార్థులను సమీకరించి బోధించారు.

## శిక్షణ కేంద్రంగా ఎస్ఆర్‌నగర్ పీఎస్

పోలీస్ స్టేషన్ శిక్షణ కేంద్రంగా మారింది. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లోని మూడవ అంతస్తులో కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ ఇప్పించారు. ఎస్ఐలు, కానిస్టేబుళ్లతో మెళుకువలు చెప్పించారు. పరీక్షలు ఎలా ఉంటాయి. ప్రశ్నా పత్రాల్లో మంచి మార్కులు ఎలా సాధించాలి, శారీరక ఫిట్‌నెస్, రన్నింగ్, జంపింగ్ వంటి ఎన్నో అంశాల్లో బోధించిన తీరు నిరుద్యోగ యువతకు దిశానిర్దేశం చేసింది. ప్రణాళికాబద్ధంగా క్లాసులు చెప్పి ఉద్యోగ అభ్యర్థులను రాటుదేలేలా చేశారు. పోలీసుల శ్రమ ఊరికే పోలేదు. ఇన్‌స్పెక్టర్ సైదులు ప్రోత్సాహం.. విద్యార్థుల కృషితో ఇప్పుడు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించగలిగారు.

## పోలీస్ అవ్వడానికి పేదరికం అడ్డుకాలేదు

పోలీస్ అవ్వడానికి పేదరికం అడ్డుకాదని నిరూపించారు. 23మంది అభ్యర్థులు శిక్షణ పొందగా.. రిలో 12 మంది కానిస్టేబుల్ ఉద్యోగానికి సెలక్ట్ అయ్యారు. అప్పటి ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు ప్రోత్సాహంతోనే ఈ ఉద్యోగం పొందగలిగామని తెలుపుతున్నారు. పోలీస్ అధికారులు చెప్పిన ఈవెంట్స్ ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువకులు వారి కుటుంబ సభ్యులతో కలిసి సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్ కార్యాలయానికి చేరుకొని ఇన్‌స్పెక్టర్ సైదులుకు కృతజ్ఞతలు తెలిపారు.

### వారు చెప్పిన క్లాసులతోనే ఉద్యోగం



మోతీనగర్ హమాలీ బస్తీకి చెందిన రవితేజది నిరుపేద కుటుంబం. తండ్రి శ్రీనివాస్ రోజువారి కూలి. తల్లి టైలరింగ్ చేస్తుంది. కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కోచింగ్ ఇస్తున్నారనే విషయం స్నేహితుల ద్వారా తెలుసుకొని అక్కడికి వెళ్లాను. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూనే కానిస్టేబుల్ పరీక్షలకు పోలీస్ స్టేషన్‌లో ప్రిపేర్ అయ్యాను. ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్ఐ.లు, కానిస్టేబుళ్లు చెప్పిన క్లాసులు ఉద్యోగం రావడానికి కారణం అయ్యాయి.

– జి.రవితేజ, హమాలీ బస్తీ, మోతీనగర్

### సీఐ సైదులు మా జీవితాల్లో వెలుగులు నింపారు



ఇన్‌స్పెక్టర్ సైదులు మా జీవితాల్లో వెలుగులు నింపారు. పేదరికంతో ఉన్న యువతకు దారి చూపాలని ఎంతో శ్రద్ధ పెట్టేవారు. బాగా చదువుకొని పరీక్షలకు సిద్ధమయ్యేలా మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించారు. పోలీసుల కోచింగ్‌తో ఇప్పుడు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. నాన్న లేని లోటు రానివ్వకుండా అమ్మ అన్నీ తానై పెంచింది. అమ్మ కష్టాలు తీర్చాలనే పట్టుదలతో కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను. ఉద్యోగం సాధించాను. అమ్మ కష్టాలు తీరుస్తా.

– ఎండీ.హనీఫ్, వెంకటగిరి, యూసుఫ్‌గూడ, పోలీస్ కానిస్టేబుల్

### పేద విద్యార్థులను ఎంపిక చేసి కోచింగ్ ఇచ్చాం

ఏడాది కిందట కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడింది. అప్పుడు నేను ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నా. మా ప్రాంతంలోని పేద కుటుంబాలకు చెందిన ఉద్యోగార్థులను సమీకరించాను. చాలామందికి సింగిల్ పేరెంటే ఉన్నారు. తండ్రి ఉంటే తల్లి లేరు. తల్లి ఉంటే తండ్రి లేని కుటుంబాలకు చెందిన నిరుపేద కుటుంబాల్లోని చదువుపై ఆసక్తి చూపే వారితో మాట్లాడాను. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు అవసరమైన కోచింగ్‌ను ఉచితంగా ఇస్తామని చెప్పా. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లోని మూడవ అంతస్తును లెర్నింగ్ స్కూల్‌గా మార్చాను. నాతో పాటు ఎస్ఐ.లు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు అంతా క్లాసులు చెప్పారు. మేమిచ్చిన కోచింగ్‌తో 12మంది కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు సాధించడంతో నాకు చాలా సంతోషంగా ఉంది. నా సొంత పిల్లలే ఉద్యోగాలు సాధించినంత ఆనందంగా ఉంది.



– సైదులు, నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్, ఇన్‌స్పెక్టర్

## చీకట్లు మిగిల్చే కాంగ్రెస్ కావాలా..?

సీఎం కేసీఆర్ హయాంలో.. పదేండ్లలో వందేండ్ల అభివృద్ధి చేశాం

# వెలుగులు నింపే బీఆర్ఎస్ కావాలా..?

- కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోవద్దు
- మరిచిపోయి అధికారం అంటగడితే.. వందేండ్లు వెనక్కి తీసుకుపోతరు
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, తదితరులు

కందుకూరు/మహేశ్వరం, అక్టోబర్ 8 : కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు మోసపోవద్దని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఒక ప్రత్యేక విజన్‌తో మహేశ్వరం నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. ఆదివారం మహేశ్వరం మండల పరిధిలోని తుమ్మలూరు, గంగారం, రామచంద్రగూడ, కోళ్లపడకల్, కల్వకోల్, పెండ్యాల, దుబ్బచెర్ల, పోరండ్ల గ్రామాలలో రూ.16 కోట్ల 36 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డితో ప్రారంభించారు. తుమ్మలూరులో బతుకమ్మ కుంట వద్ద జడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన తెలుగు తల్లి విగ్రహాన్ని ప్రారంభించారు. కందుకూరు మండల పరిధిలోని సార్లరావులపల్లి తండాలో రూ.2.50కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, నూతన గ్రామ పంచాయతీ భవనం, ఫంక్షన్ హాల్‌ను సర్పంచ్ రజిత ప్రవీణ్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆ పార్టీ అధికారంలోకి వస్తే 3గంటల విద్యుత్ ఇస్తానని చెపుతున్నాడని, మీకు 3గంటలు ఇచ్చే కాంగ్రెస్ పార్టీ కావాలా, లేక 24గంటలు ఉచితంగా ఇచ్చే సీఎం కేసీఆర్ ప్రభుత్వం కావాలా అని ప్రశ్నించారు. గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రూ.200 ఇచ్చిందని, సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2,116వేలు ఇస్తున్నారని తెలిపారు. తాగునీటి సమస్యను తీర్చాం, ఎరువుల సమస్య లేకుండా చేశాం, వైద్య రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపామని, ఇంత సక్కగున్న తెలంగాణను తప్పిపోయి కాంగ్రెస్ చేతిలో పెడితే మళ్లీ మొదటికి వస్తుందని చెప్పారు. సీఎం కేసీఆర్‌పై ప్రజలకు నమ్మకం, విశ్వాసం ఉన్నదని చెప్పారు. ఢిల్లీ పార్టీలు మన రాష్ట్రానికి అవసరమా.? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ అడ్డా అని.., మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

### గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాం

అన్ని రంగాల్లో గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లను కల్పించినట్లు మంత్రి సబితారెడ్డి తెలిపారు. గిరిజనుల ఆత్మగౌరవం కోసం బంజారాహిల్స్‌లో గిరిజన భవనం నిర్మించామని చెప్పారు. 500 జనాభా ఉన్న ప్రతి తండాను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి పాండు, మార్కెట్ యార్డు చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, వైఎస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి దశరథ ముదిరాజ్, చిర్ర సాయిలు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, రైతు విభాగం అధ్యక్షుడు సోలిపేట అమరేందర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు మల్లేశ్, కాకి రాములు, తాంద్ర ఇందిరమ్మ దేవేందర్, మాజీ సర్పంచ్ గోవర్ధన్ నాయక్, నర్సింహ, బాలు, సర్పంచ్‌లు మంద సాయిలు, శేఖర్ గుప్తా, కుమార్, యూత్ నాయకులు తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, మాజీ డైరెక్టరు పారిజాతం, రాము, పాండు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌చారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందరి సమన్వయంతోనే ఇసుక లారీల అడ్డా తరలింపు

- 22 కాలనీల వాసులకు విముక్తి
- ఎల్బీనగర్‌లో రూ.3718 కోట్ల అభివృద్ధి చేశాం
- పారాచూట్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి




ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

హయత్‌నగర్, అక్టోబర్ 8 : ఆటోనగర్ ఇసుక లారీల అడ్డాను తరలించడం వల్ల చుట్టుపక్కల కాలనీల ప్రజలకు సంపూర్ణమైన విముక్తి లభించిందని ఎంఆర్‌డీసీఎల్ చైర్మన్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హయత్‌నగర్ డివిజన్ లోని హైకోర్టు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వనస్థలిపురం తూర్పు కాలనీల అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. 22 కాలనీల ప్రజల పట్టుదలతో ఇసుక లారీల అడ్డాను ఇక్కడి నుంచి తరలించామని తెలిపారు. లారీల యజమానులు, వారి అసోసియేషన్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసు ఉన్నతాధికారులు, ఆర్టీఏ, ఆర్అండ్‌బీ అధికారుల సమన్వయంతోనే ఇసుక లారీల అడ్డా తరలింపు సాధ్యమైందన్నారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.నర్సింహారెడ్డి సహకారంతో ఆటోనగర్‌లో ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి స్థానికుల సమస్యను పరిష్కరించారని కొనియాడారు.

### ఎల్బీనగర్ అభివృద్ధిపై చర్చకు సిద్ధం

ఇప్పటి వరకు రూ.3718 కోట్లతో ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, దీనిపై చర్చించేందుకు తాను సిద్ధమని ప్రతిపక్ష నాయకులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా అత్యాధునిక పార్కులు, శ్మశాన వాటిక, స్విమ్మింగ్ పూల్‌లు, బస్ టెర్మినల్స్ ఎల్బీనగర్‌కు తీసుకొచ్చామని తెలిపారు. ఎన్నికల అనంతరం నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రోరైలు పొడిగించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని, సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా ఎలాంటి శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లలేదని స్పష్టంచేశారు. పారాచూట్ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మరోసారి అవకాశమిచ్చి అతిభారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమలరెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఏర్పుల దేవ ప్రసన్నకుమార్, జక్కిడి మల్లారెడ్డి, భాస్కర్ సాగర్, ఈస్టర్న్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దీపావళి శ్రావణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్‌రెడ్డి, కోశాధికారి బాదం శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు సదర్శన్‌రెడ్డి, నరసింహారావు, ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భరత్‌సింగ్, జాయింట్ సెక్రటరీ సుధీర్‌రెడ్డి, దీపావళి శ్రీకాంత్, జలెందర్, ప్రవీణ్ గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, సునీల్ కుమార్, మాదవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఒత్తిడిలేని జీవితం గడపాలి

సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : మానసిక ఆరోగ్యంతోనే జీవితం ఆనందమయమని కౌన్సెలింగ్ సైకాలజిస్టు మోత్కూరి రామచంద్రం తెలిపారు. ఈనెల 10న (మంగళవారం) ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆయన ఆనందకరమైన జీవితంపై పలు సూచనలు చేశారు. ప్రతి రోజు శారీరక వ్యాయామాలు, ప్రాణయామం చేయాలన్నారు. స్వీయ నియంత్రణ చాలా అవసరమని, ప్రతి ఒక్కరూ ఒత్తిడిలేని జీవితం గడపేల చూసుకోవాలని అన్నారు.